క్లుప్తంగా

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సహకార బ్యాంక్ మేనేజర్‌కు చెక్కును అందజేస్తున్న నిరంజన్‌బాబురెడ్డి

కోవూరు: రైతుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని డీసీసీబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి పేర్కొన్నారు. 2022 రబీ సీజన్‌లో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తోలిన 966 మంది రైతులకు హమాలీ ఖర్చుల కింద ప్రభుత్వం రూ.24,64,650 మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన చెక్కులను పడుగుపాడు సొసైటీ కార్యాలయంలో కోవూరు సహకార బ్యాంక్ మేనేజర్ సుధాకర్‌కు సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డితో కలిసి డీసీసీబీ చైర్మన్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా నిరంజన్‌బాబురెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు రైతుల సంక్షేమానికి ఆశించిన మేర చొరవ చూపిన దాఖలాలు లేవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు మద్దతు ధరలు అందజేస్తుందన్నారు. సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ సొసైటీకి సంబంధించి ఇనమడుగులోని పాత గోదాము శిథిలావస్థకు చేరడంతో ఆ ప్రాంతంలో నూతనంగా పెట్రోల్ బంక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. పాత గోదాము భవనం తొలగింపు, ఫర్నిచర్‌కు ఈ నెల 30లోగా టెండర్లు ఆహ్వానించనున్నట్లు చెప్పారు. వచ్చిన టెండర్లను అదేరోజు ఫైనల్ చేస్తామన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, సొసైటీ సీఈఓ గోవర్ధన్‌రెడ్డి, మేనేజర్ ఎన్ స్వప్న, శివకుమార్‌రెడ్డి, కే ప్రసాద్ పాల్గొన్నారు.

అవినీతిని అరికడితేనే నిజమైన అభివృద్ధి



మాట్లాడుతున్న సుధాకర్‌రావు

మనుబోలు: సమాజంలో పేరుకుపోయిన అవినీతికి అడ్డుకట్ట వేస్తేనే నిజమైన అభివృద్ధి సాధ్యమని కాగితాలపూరు రోడ్డులోని 400 కేవీ పవర్ గ్రిడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రావు పేర్కొన్నారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కాగితాలపూరులో అవినీతి నిర్మూలనపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని వివిధ వ్యవస్థల్లో వేళ్లనుకుపోయిన అవినీతి మూలంగా అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అవినీతికి పాల్పడితే ఎలా ఫిర్యాదు చేయాలో వివరించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతారని తెలిపారు. అవినీతి పెచ్చుమీరితే దేశం అదోగతి పాలవుతుందన్నారు. అవినీతి నిర్మూలనను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ ఐ శ్రీకృష్ణ, హెచ్‌ఆర్ జితేంద్ర బెహరా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



మనుబోలు: మండలంలోని అప్పయ్యగేటు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. వివరాలు.. మనుబోలుకు చెందిన కసుమూరు రామసుబ్బారెడ్డి స్కూటీపై నెల్లూరు వెళ్లి తిరిగి వస్తున్నాడు. అప్పయ్యగేటు సమీపంలోకి రాగానే స్కూటీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని 108 వాహనంలో నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయానికి నగదు విరాళం

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వర స్వామి ఆలయానికి మన్నెం శ్యాంప్రసాద్,లక్ష్మి దంపతులు రూ.50 వేల నగదు విరాళాన్ని శుక్రవారం అందజేశారు. ఆలయ నిర్వాహక కమిటీ కార్యదర్శి వాకాటి శ్రీనివాసులురెడ్డికి నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొమ్మి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబన సాధించాలి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి



పాఠశాల భవన ప్రారంభ కార్యక్రమంలో ఎంపీ ఆదాల

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 2, 12వ డివిజన్లలోని అల్లీపురం, పెద్దచెరుకూరు ప్రాంతాల్లో రూ.1.4 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనను శుక్రవారం నిర్వహించారు. అనంతరం మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన పొదుపు సమాఖ్య సంఘాల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమమే తమ పార్టీ లక్ష్యమని తెలిపారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని చెప్పారు. పొదుపు మహిళల అవసరాల మేరకు బ్యాంకుల నుంచి రుణాలను మంజూరు చేయించనున్నామని పేర్కొన్నారు. మేయర్ స్రవంతి, కమిషనర్ వికాస్ మర్మత్, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అవసరం

దాతల సహకారం ఎంతో అవసరమని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 29వ డివిజన్లోని వెంకటరెడ్డినగర్‌లో గంటా రమణయ్యనాయుడి దాతృత్వంతో నిర్మించిన మున్సిపల్ స్కూల్ భవనాన్ని ఎంపీ ప్రారంభించారు. దాతను అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. నాడు – నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు ఎంతో అభివృద్ధి చెందాయని వివరించారు. మేయర్ స్రవంతి, కార్పొరేటర్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సమావేశానికి ఆహ్వానం



నెల్లూరు(దర్గామిట్ట): వచ్చే నెల ఒకటిన నిర్వహించనున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జి రామిరెడ్డి రోజారెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉమమహేశ్వరరెడ్డి ఆహ్వానించారు.

ఈ మేరకు మంత్రిని నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

30న జాబ్ మేళా

నెల్లూరు(మినీబైపాస్): నగరంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళాను సోమవారం ఉదయం 10.30కు నిర్వహించనున్నామని జిల్లా ఉపాధి అధికారి వినయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపోలోలో ఫార్మసిస్ట్, ఫ్లిప్‌కార్ట్ కంపెనీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నారని వివరించారు. ఎస్సెస్సీ నుంచి డిగ్రీ వరకు చదివిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు హాజరుకావాలని కోరారు.

అభివృద్ధి కనిపించడంలేదా..?

నెల్లూరు(మినీబైపాస్): జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కనిపించడంలేదానని జనసేన నేత గునుకుల కిశోర్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత ప్రసాద్ ప్రశ్నించారు. ఈ మేరకు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. నెల్లూరు రూరల్ సమన్వయకర్తగా ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నియమించిన నాటి నుంచి నియోజకవర్గం అభివృద్ధి వైపు పరుగులు తీస్తోందని వివరించారు. ప్రతిపక్ష పార్టీల నేతల నుంచి డబ్బులు తీసుకొని తమ పార్టీ ప్రజాప్రతినిధులపై ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం



ముత్తుకూరు: పేద మహిళల ఆర్థికాభివృద్ధే తమ సంస్థ ధ్యేయమని ఆదాని ఫౌండేషన్ సదరన్ రీజనల్ సీఎస్సార్ హెడ్ అనిల్‌బాలకృష్ణన్ పేర్కొన్నారు. ఆదాని కృష్ణపట్నంపోర్టులో మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఒక్క రోజు ఎక్స్‌పోను శుక్రవారం నిర్వహించారు. పోర్టు కార్పొరేట్ వ్యవహారాల హెడ్ వేణుగోపాల్‌తో కలసి అనిల్‌బాలకృష్ణన్ మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ఫౌండేషన్ సహకరిస్తుందన్నారు. ఉత్పత్తుల మార్కెటింగ్‌కు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజేష్ రంజన్, గంగాసతీష్, శ్రీనివాసులు, రమేష్ బాబు పాల్గొన్నారు.

పార్క్ అభివృద్ధి పనుల పరిశీలన



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని బెజవాడ గోపాల్‌రెడ్డి పార్క్ అభివృద్ధి పనులను నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎం సుప్రజ, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. పార్క్‌లో చేపడుతున్న పనులపై కాంట్రాక్టర్‌కు సూచనలు చేశారు. అనంతరం చైర్‌పర్సన్ సుప్రజ మాట్లాడుతూ పార్క్ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. పార్క్ అభివృద్ధి పనులకు రూ.కోటి మంజూరు చేసిన ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కౌన్సిలర్లు జయంతి, అనంతమ్మ, ప్రమీల, నాయకులు సీహెచ్ సురేష్, ఇలియాజ్, బీ సురేష్, అల్లా భక్షు, ఏఈ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



పరిశీలిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నగరంలోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. లైంగిక వేధింపుల నుంచి మహిళలు, పిల్లలకు రక్షణ – సామాజిక పాత్ర అనే అంశంపై విద్యార్థులకు.. సోషల్ మీడియా దుర్వినియోగం – సైబర్ మోసాలను అరికట్టడంలో సాంకేతికత పాత్ర అనే అంశంపై పోలీస్ అధికారులు, సిబ్బందికి పోటీలను జరిపారు. వీటిని పరిశీలించిన అనంతరం ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి మాట్లాడారు. పోలీస్ శాఖపై అవగాహన, స్ఫూర్తి కల్పించేందుకు.. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు గానూ పోటీలను నిర్వహించామని వివరించారు.

ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ గాంధీ, ఆర్‌ఐలు అంకమరావు, శ్రీనివాసరెడ్డి, పాల్‌రాజు, పీఆర్వో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలియోపై విద్యార్థులకు అవగాహన



విజేతలకు బహుమతుల ప్రదానం

నెల్లూరు(బృందావనం): ప్రపంచ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు అవగాహన సదస్సును ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని రోటరీ క్లబ్ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించారు. జిల్లాలోని ఐదు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి ప్రశంస పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. రోటరీ క్లబ్ నెల్లూరు అధ్యక్ష, కార్యదర్శులు సమీవుల్లా, ఉదయభాస్కర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పీడీజీ భరత్‌కుమార్‌రెడ్డి, ఏజీపీ భానుమతి పాల్గొన్నారు.

సాహిత్య రంగాన్ని ప్రోత్సహిద్దాం



నెల్లూరు(బృందావనం): విశాలాక్షి సాహిత్య మాసపత్రిక చేపడుతున్న కార్యక్రమాలను ప్రోత్సహించాలని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. పురమందిర ప్రాంగణంలోని ఏసీ హాల్లో ఆదివారం నిర్వహించనున్న విశాలాక్షి వృద్ధాశ్రమం, విశాలాక్షి సాహిత్య మాసపత్రిక వార్షికోత్సవ సంబరాల ఆహ్వాన పత్రికలను గాంధీబొమ్మ సమీపంలోని అమరావతి చాంబర్స్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన కథ, కవిత, మినీకథ, కార్టూన్ పోటీల్లో విజేతలైన 120 మంది కళాకారులను ప్రోత్సహించేందుకు గానూ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని తెలిపారు. నిర్వాహకుడు కోసూరు రత్నం, సంపాదకుడు ఈతకోట సుబ్బారావు, కళాసంఘాల కన్వీనర్లు భాస్కర్, నేదురుమల్లి హరనాథరెడ్డి పాల్గొన్నారు.

వేడుకగా గంధ మహోత్సవం



నెల్లూరు రూరల్: కొత్తూరు పరిధిలోని శ్రామికనగర్‌లో గల గౌస్ – ఏ – పాక్ దర్గా వద్ద గంధ మహోత్సవాన్ని వేడుకగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదానాన్ని నిర్వహించారు.

రూరల్ మండల సర్వసభ్య సమావేశం నేడు

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ మండల సర్వసభ్య సమావేశాన్ని నగరంలోని రూరల్ ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించనున్నామని ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.

లక్ష్మీనృసింహుడి ఆలయ మూత నేడు

నెల్లూరు రూరల్: చంద్ర గ్రహణం సందర్భంగా నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని శనివారం సాయంత్రం మూత వేయనున్నామని చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ శుద్ధి, అభిషేకాలు, పూజలను ఆదివారం నిర్వహించనున్నామని చెప్పారు.

త్వరితగతిన ఈవీఎంల పరిశీలన పూర్తి



పరిశీలనకు వస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు రూరల్: రానున్న ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంల పరిశీలనను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. నగరంలోని ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో గల ఈవీఎంల గోదాము వద్ద ఈవీఎంల పరిశీలనను శుక్రవారం తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈవీఎంల పరిశీలకులు ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని ఆదేశించారు. పరిశీలనను వచ్చే నెల పదిలోపు పూర్తి చేయాలని, అదే రోజున మాక్ పోలింగ్‌ను నిర్వహించనున్నామని వివరించారు. ఈవీఎంల పర్యవేక్షణాధికారి ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం



మందులను పంపిణీ చేస్తున్న కమిషనర్ తదితరులు

నెల్లూరు(బారకాసు): ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండటమే ప్రభుత్వ లక్ష్యమని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. దండువారివీధి, గిడ్డంగివీధి, అరవిందనగర్, సాయినిలయంవీధి, టీచర్స్‌కాలనీ, నేతాజీనగర్, రాజాగారివీధి, జాకీర్‌హుస్సేన్‌నగర్ తదితర ప్రాంతాల్లో గల పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. సాధారణ వ్యాధులతో పాటు బీపీ, షుగర్, నేత్ర పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లద్దాలను అందజేస్తున్నారని వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదనపు కమిషనర్ శర్మద, ఎంహెచ్ఓ వెంకటరమణ, వైద్యాధికారి జిజియాబాయి, టీపీఆర్వో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల ఆరోగ్యానికి భరోసా ఏర్పడుతుందని నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్ పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని కొండ్లపూడిలో నిర్వహించారు. అనంతరం పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. సౌత్‌మోపూరు పీహెచ్‌సీ వైద్యురాలు కవిత తదితరులు పాల్గొన్నారు.



కొండ్లపూడిలో..

పాటలు, డ్యాన్స్ పోటీలు రేపు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో పాటలు, డ్యాన్స్ పోటీలను ఆదివారం నిర్వహించనున్నామని కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను పురమందిర ప్రాంగణంలో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పలువురు ప్రముఖులను సత్కరించనున్నామని చెప్పారు. అమానుల్లాఖాన్, రమణయ్య, రఘురామిరెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

పోలీసులపై కోటంరెడ్డి ఓవరాక్షన్

నెల్లూరు సిటీ: పోలీసులపై టీడీపీ నేత కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మరోసారి ఓవరాక్షన్ చేశారు. వివరాలు.. జిల్లాలోని సైదాపురంలో క్వార్ట్జ్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు అక్రమంగా తవ్వి తరలిస్తున్నారంటూ టీడీపీ నేతలు సైదాపురం సందర్శనకు శుక్రవారం పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో శాంతిభద్రతల దృష్ట్యా పర్యటనకు అనుమతి లేదంటూ పోలీసులు ప్రకటించారు. టీడీపీ నేత కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తన అనుచరులతో నెల్లూరులోని తన ఇంటి నుంచి బయటకొస్తుండగా బాలాజీనగర్ పోలీసులు పర్యటనకు అనుమతి లేదని హౌస్ అరెస్ట్ చేస్తున్నామని చెప్పి నిలువరించే యత్నం చేశారు. తాను సైదాపురం వెళ్లడం లేదని, పెళ్లికి వెళ్తున్నానంటూ పోలీసులను నమ్మించేందుకు యత్నించారు. పోలీసులు అడ్డుకుంటుండగా షర్ట్‌పై చేయి వేయొద్దంటూ వారిపై మండిపడ్డారు. వారు ఎంతగా యత్నించినా తోసేశారు. ఎవడ్రా ఆపేదంటూ తన కారులో సైదాపురం బయల్దేరారు. బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ రాములునాయక్ ఆయన్ను వెంబడించి దారిలో హౌస్ అరెస్ట్ నోటీస్ ఇచ్చేందుకు యత్నించినా తీసుకోకుండా వెళ్లిపోయారు.

క్రీడలపై యువత ఆసక్తి చూపాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ అంకమరావు

వెంకటాచలం: గ్రామీణ ప్రాంత యువత చెడు అలవాట్ల వైపు వెళ్లకుండా క్రీడలపై ఆసక్తి చూపాలని సీఐ అంకమరావు అన్నారు. స్థానిక ఇందిరమ్మకాలనీ వద్ద వెంకటాచలం ప్రీమియర్ లీగ్(వీపీఎల్) క్రికెట్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామానికి చెందిన యువకులు ఐకమత్యంతో వీపీఎల్ క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయన్నారు. యువత చెడు వ్యసనాలకు స్వస్తి చెప్పి, సమయం దొరికినప్పుడు క్రీడల్లో పాల్గొనాలన్నారు.

జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలి



అమృత కలశంతో ర్యాలీ

మనుబోలు: ప్రతిఒక్కరూ దేశభక్తి, జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలని ఎంపీడీఓ ప్రసాద్ అన్నారు. నా భూమి, నా దేశం కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయం నుంచి అమృత కలశంతో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజల్లో జాతీయ భావాన్ని, దేశభక్తిని పెంపొందించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నా భూమి, నా దేశం కార్యక్రమాన్ని చేపట్టాయని వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రధాని చెప్పిన ఐదు సూత్రాలను పాటించి భారత దేశాన్ని ప్రపంచంలో విశ్వ గురువుగా నిలిపేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అమృత కలశ యాత్రలో భాగంగా మండలంలో సేకరించి మట్టి, బియ్యాన్ని ఢిల్లీకి పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ రవికుమార్‌రెడ్డి, ఈఓపీఆర్డీ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు కృష్ణవేణి, పద్మ, మంజుల, రేష్మసోని, శీనయ్య, రాజా, చెంచుప్రసాద్, అంకబాబు, సునంద, ఐసీడీయస్ సూపర్‌వైజర్ రమణమ్మ పాల్గొన్నారు.